రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులు

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 39, 40 డివిజన్ల పరిధిలో రూ.1.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 39,40 డివిజన్ల పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి మూలాపేటలోని చాముండివారితోట పార్కు వద్ద సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 39, 40 డివిజన్లలో పర్యటించామని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు విన్నవించిన సమస్యలకు సంబంధించి రూ.1.25 కోట్లతో చాముండివారితోట, తిరిపిపేటలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, తిరిపిపేట, పాముల మాన్యంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతున్నామని వివరించారు. మరో పది రోజుల్లో నగర నియోజకవర్గ పరిధిలో రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సమస్యలపై అడిగే హక్కు ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తనపైన ఉంటుందన్నారు. ఆ దిశగా నిత్యం ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తూ ధైర్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ప్రజలు ఏదో తిట్టారని అలిగితే కుదరదని, వారు సమస్యలు విన్నవించినప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా వలంటీర్లు, నాయకులు కార్యకర్తలు ప్రజల్లోనే తిరుగుతున్నారన్నారు. స్థానిక డివిజన్లలోని పెండింగ్ పనులను మరో రెండు నెలల్లో సంపూర్ణంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే స్థానికంగా రూ.85 లక్షలతో పార్కు నిర్మించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నగర నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకొచ్చారో..తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఎన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశానో శ్వేత పత్రం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయులు మానికల సునీల్, నూనె ప్రసాద్, మల్లి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

క్లుప్తంగా

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని పుత్తా ఎస్టేట్‌లోని ప్యూర్ స్మైల్ సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకురాలు షేక్ పర్వీన్ మాట్లాడుతూ మహిళల ఉపాధి కల్పకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. బ్యాచ్‌కు పదిహేను మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తామని, ఆసక్తి కలిగిన మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ అమృతవల్లి, సంఘమిత్ర మహిళా లయన్స్ క్లబ్ సభ్యులు స్వర్ణ, సంధ్య సునీత, విశ్వమాత సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు కళ్యాణి, ప్యూర్ స్మైల్ సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నెల్లూరు(వేదాయపాళెం): భవన నిర్మాణ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ కోరారు. ఈ మేరకు మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగరాధ్యక్ష, కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, కాయం శ్రీనివాసులు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎంఎంఈ కార్యవర్గం



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వికాస్‌మర్మత్‌ను మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చక్రపాణి, ఎంఎంఈ సంఘం నూతన అధ్యక్షుడు పీ శీనయ్య, కార్యదర్శి ఇనయతుల్లా, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, నిర్వాహక కార్యదర్శి రవి, కన్వీనర్లు కృష్ణకిషోర్, సునీల్ కుమార్, ట్రెజరర్ వంశీనాథ్‌రెడ్డి, మహిళా ఆర్గనైజర్ విజయ, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష




నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఆర్వో వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. సోమవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ప్రతి మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓలు రెండు బృందాలుగా ఏర్పడి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. తొలుత అధికారులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను నమోదు చేసుకుంటున్నారన్నారు. అనంతరం సచివాలయంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో అసైన్మెంట్ భూముల పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు. అందుకు సంబంధించి 2,799 మంది లబ్ధిదారులను గుర్తించామని, దాదాపు 3వేల ఎకరాలు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

30లోగా ఆస్తి పన్ను చెల్లించాలి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు మొదటి అర్థ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ఆస్తి పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

జగనన్న సురక్ష సర్వే



నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్లు 28వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 28వ డివిజన్‌లో జనగనన్న సురక్ష సర్వేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు.

సమస్యలను శాశ్వత ప్రతిపాదికన పరిష్కరించాలి

నెల్లూరు(బారకాసు): జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను సంబంధిత విభాగాధిపతులే నేరుగా పరిశీలించి శాశ్వత ప్రతిపాదికన పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనకు 40 అర్జీలు అందగా సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన, ఏపీ సేవా పోర్టల్, డయల్ యువర్ కమిషనర్‌కు అందిన ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నందున బాధ్యతతో పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్షపై యాక్షన్ ప్లాన్‌ను సచివాలయాల వారీగా సిద్ధం చేసుకోవాలన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయండి

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో చేపడుతున్న రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ తన చాంబర్‌లో రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. రీ సర్వేలో సచివాలయాల అడ్మిన్, ప్లానింగ్, వీఆర్వో, కార్యదర్శుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి కలిగిన ప్రతి ఒక్కరికీ రీ సర్వే ఆధారిత శాశ్వత భూహక్కు పత్రాలను అందజేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరు వరకు చేపట్టనున్న రీ సర్వేకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశాల్లో అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ దేవికుమారి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, మేనేజర్ ఇనయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

కోటంరెడ్డి సోదరులు నమ్మకద్రోహులు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నమ్మకద్రోహులని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆశీర్వాదంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఎమ్మెల్యే అవకాశం దక్కిందని పలుమార్లు బహిరంగంగా చెప్పిన శ్రీధర్‌రెడ్డి నేడు వైఎస్సార్‌సీపీని వీడి ఆ పార్టీపై నిందలు మోపడం సిగ్గుచేటు అన్నా రు. సీఎం వైఎస్ జగన్ పాలనను విమర్శించే స్థాయి కోటంరెడ్డి సోద రులకు లేదన్నారు. నగర ఎమ్మెల్యే అనిల్‌పై విమర్శలు చేసే స్థాయి గిరిధర్‌రెడ్డికి లేదన్నా రు. నమ్మకద్రోహానికి కోటంరెడ్డి సోదరులు బ్రాండ్ అంబాసిడర్లని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కోటంరెడ్డి సోదరులకు రూరల్ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కోటంరెడ్డి రాజకీయ జీవితానికి చంద్రబాబు సమాధి కట్టడం తథ్యమన్నారు.


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

అప్రమత్తతతో విద్యుత్ ప్రమాదాల నివారణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్):అప్రమత్తతతో విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన నగరంలోని విద్యుత్‌భవన్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏటా జూన్ 26 నుంచి జూలై 2వ తేదీ వరకు జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి ఆదేశాల మేరకు, ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ లావణ్య సూచనల మేరకు సోమవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎస్సైలు కే సాంబశివరావు, పుల్లారెడ్డి, పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి

మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారం


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


నవజీవన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

• ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను అంధకారం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పోలీసు కవాతు మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కళాశాలల విద్యార్థులతో కలిసి పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా మత్తుపదార్థాలకు అలవాటుపడితే అది వ్యసనంగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. మత్తుకు బానిసైతే ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. మత్తులో యువత నేరాలకు పాల్పడుతున్నారని గుర్తుచేశారు. ప్రధానంగా పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, వారి నడవడికను గమనిస్తూ ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగిస్తే ఆరు నెలల నుంచి ఏడాది, డ్రగ్స్‌ను కలిగి ఉన్నా.. అమ్మినా, ప్రోత్సహించినా 10 నుంచి 20 ఏళ్ల జైలు, జరిమానా తప్పవన్నారు. జిల్లాలో మత్తుపదార్థాల విక్రయాలు, సేవనం, అక్రమ రవాణా జరుగుతున్నట్లు ప్రజలు గుర్తిస్తే డయల్ 100 లేదా సెబ్ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్పీ డి.హిమవతి, డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, అబ్దుల్ సుభాన్, గాంధీ, సెబ్ ఈఎస్ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, నగర సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.


కృష్ణచైతన్యలో అవగాహన కల్పిస్తున్న సీఐ

నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నబజారు పోలీసు స్టేషన్ సీఐ అశోక్‌కుమార్ మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

➡ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ రామ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలోని విద్యార్థినులకు మాదకద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సుబ్బమ్మ, వైస్‌ప్రిన్సిపల్ రమణయ్య, అధ్యాపకులు మమత, కళాప్రియ, దివ్య పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: ఏపీఎస్‌ఏసీఎస్ సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జీజీహెచ్ నుంచి కొండాయపాళెంగేట్ వరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బిందుమాధవి, రూడ్స్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు షేక్ రసూల్, ప్రభాకర్, రమేష్,శివ, సురేంద్ర, కార్తీక్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

1న క్యాంపస్ ఎంపికలు

నెల్లూరు(బారకాసు): కొత్తూరులోని ఎస్ఆర్ఆర్ ఐటీఐలో చెన్నైకు చెందిన ఫెనెస్టా బిల్డింగ్ సిస్టమ్స్ సంస్థ జూలై 1న క్యాంపస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ అబ్దుల్‌రెహమాన్ సోమవారం తెలిపారు. టెక్నికల్ ట్రెయినీ పోస్టులకు ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని చెప్పారు. నాన్‌టెక్నికల్ పోస్టులకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా అర్హులని తెలిపారు. వివరాలకు 91763 79690, 97039 67967 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జీ వెంకటలక్ష్మి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం హరినారాయణన్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినులకు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతిని నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానంద్‌బాబా సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరానికి వచ్చిన ఆమెకు తహసీల్దార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వైఎస్సార్ లా నేస్తం విడుదలపై హర్షం

నెల్లూరు(లీగల్): ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూనియర్ న్యాయవాదులకు మొదటి విడత 'వైఎస్సార్ లా నేస్తం' స్టయిఫండ్‌ను సోమవారం విడుదల చేయడంపై నెల్లూరు పార్లమెంటరీ జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వై మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ లా నేస్తం' పథకాన్ని ప్రారంభించి జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.5వేలు స్టయిఫండ్ అందజేయడం సంతోషకరమన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌పై హర్షం

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులు తమ వ్యక్తిగత సమస్యలను కలెక్టర్లు, హెచ్ఓడీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం, వాటిని జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

• కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో మనబడి నాడు-నేడు రెండో విడత పెండింగ్ పనులను నాణ్యతతో వారాంతానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షించి సూచనలు చేశారు. వారంలోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించి బడి ఈడు పిల్లలందరూ బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని తెలిపారు. 'జగనన్న గోరుముద్ద' మెనూను పటిష్టంగా అమలు చేయాలన్నారు. డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగ వరప్రసాద్, ఐటీడీఏ పీఓ రాణి మంద, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, ఏపీఈ డబ్ల్యూ ఐడీసీ ఈఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు సమష్టి కృషి

జిల్లాలో కుష్టు వ్యాధి నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కుష్టు వ్యాధిపై అవగాహనకు వైద్యారోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను డీఎంహెచ్‌ఓ పెంచలయ్యతో కలిసి కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి నివారించేందుకు ఆశావర్కర్లు, వలంటీర్లతో కూడిన 1875 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జేసీ రోణంకి కూర్మనాథ్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, జిల్లా కుష్ఠ నివారణాధికారి దయాకర్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.


కుష్టు వ్యాధిపై రూపొందిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలి

ప్రభుత్వ గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద జిల్లాకు మంజూరైన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి వారం పనుల్లో పురోగతి సాధించాలన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో ప్రతి వారం 25 శాతం తప్పకుండా పురోగతి సాధించాలన్నారు. గృహ నిర్మాణశాఖ పీడీ నాగరాజు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.
–నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి గ్రామోత్సవం

నెల్లూరు రూరల్ : కనుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై సుబ్రహ్మణ్యస్వామిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీనివాస వైష్ణవి బృందం కోలాటం, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉభయకర్తలుగా చెన్నైకు చెందిన విస్సాకశ్యప్, లలిత, దేవరాల శ్రీనివాసులు, మంజుల, శ్రీరామ్‌సాకేత్, సపరిక,పాపిశెట్టి సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరి దంపతులు వ్యవహరించారు.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సూర్యప్రభ వాహనంపై సుబ్రహ్మణ్యస్వామి

కోటంరెడ్డి.. కలలు మానుకో

నెల్లూరు (దర్గామిట్ట): బాలకృష్ణ నీకేదో సీటు ఇప్పిస్తారని కలలు కంటున్నావేమో... పట్టాభిషేకం సినిమా కటౌట్‌ను తగలబెట్టిన సంగతిని బాలకృష్ణ మర్చిపోరని..ఇకపై ఆ కలలు మానుకోవాలని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిపై వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మల్లి నిర్మల మండిపడ్డారు. మాగుంటలేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. నీవు కార్పొరేటర్‌కు ఎక్కువ..కౌన్సిలర్‌కు తక్కువనే విషయం మర్చిపోయావా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో బాగా దండుకున్న దండకాలరాయుడివన్న సంగతిని మర్చిపోయావా అని విమర్శించారు. నీకు నగర ఎమ్మెల్యే సీటు ఇస్తారని కేసులు పెట్టించుకున్నావు.. ప్రస్తుతం నారాయణ, ఇలా కొంత మంది పేర్లు వినపడుతున్నాయి కదా.. ఈ మధ్య కాలంలో నీపై కేసులు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఎక్కువ కేసులు ఉన్నవారికి సీటు ఇస్తారని చెప్పారని, అందుకోసం నువ్వు కేసులు పెట్టించుకున్న సంగతి మరిచావా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.


మాట్లాడుతున్న మల్లి నిర్మల

గిరిజన యువకుడి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: కోడూరుపాడుకు చెందిన గిరిజన యువకుడు ఈగా శ్రీను (18) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీను బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని తల్లి ఏడాది క్రితం చనిపోయింది. ఆమెను గుర్తుచేసుకుంటూ శ్రీను అప్పుడప్పుడు మనస్తాపం చెందేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన పూరింట్లో పైకప్పు దూలానికి ఉరివేసుకుని శ్రీను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం చుట్టుపక్కల వారు గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మహిళా ఎస్సై స్వప్న ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చార్జీల్లో పది శాతం రాయితీ

నెల్లూరు సిటీ: ప్రజారవాణా సంస్థ దూర ప్రాంత సర్వీసుల్లో రాను, పోను టిక్కెట్లను ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ప్రయాణ చార్జీల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు నెల్లూరు-1 డిపో డీఎం మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి హైదరాబాద్ విశాఖపట్నం, కాకినాడ, తదితర ప్రాంతాలకు రాను, పోను టికెట్లను రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. గతంలో తిరుగు ప్రయాణానికి మాత్రమే రాయితీ ఇస్తుండగా, ప్రస్తుతం రాను, పోను వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరుణాచలానికి బస్సు సర్వీసులు

ఆషాడ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు. జూలై 2న ఉదయం 10 గంటలకు నెల్లూరు నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయాణ చార్జీ రూ.1200గా నిర్ణయించినట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి కోరారు. నగరంలోని ఇందిరాభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కపాడిపాళేనికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు సురేష్‌బాబు, వెంకట్రావ్, ఫయాజ్, అనిల్‌కుమార్, అల్లావుద్దీన్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.